# ఓ......

# మై డార్లింగ్

★

◆ రచన : శ్రీ బచ్చు వీర్రాజు. ◆

(గత సంచిక తరువాయి)

శ్రీమతి నవ్వుకొంటూ, నన్ను పలకరించి పెద్దక్కవైపుకు దారితీసింది.

శ్రీమతితో ఏకాంతం ఎప్పుడు లభ్యమవుతుందా అని నిముషమొక యుగంలా గడుపుకొస్తున్నాను.

అక్కయ్య చెప్పేమాటలు తలకెక్కడం లేదు. పిల్లలు గీతని అదరగొట్టేస్తున్నారు. నా మనసంతా "డ్యూయెట్ సాంగ్" మీదకే పోతోంది.

ఈలోపుగా పెద్ద బావవచ్చి నన్ను బజారుకు లాక్కుపోయాడు పట్టుపట్టి. నీరసంగానే దారితీసాను.

◆ ◆ ◆

భోజనాలై హాల్లోకి వచ్చేటప్పటికి రాత్రిపది గంటలు దాటింది.

నెమ్మదిగా నాకు కేటాయించిన రూమ్‌లోకి వచ్చిపడ్డాను. వెంటనే శ్రీమతి గురించి ఎదురు తెన్నులు చూడసాగాను.

కొంతసేపటికి, పెద్ద బావ మడతమంచం ఒకటి తీసుకొని నేనువున్న గదిలోకి ప్రవేశించాడు.

నేను ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను, హాల్లోంచి పెద్దక్కమాటలేవో వినిపిస్తుంటే, చెవులు సారించి వినసాగాను

"చూడు గీతా! యిందాకా వాడు బజారుకు వెళ్ళినప్పుడు, అప్పలమ్మ వచ్చి, మన సురేష్‌కు అమ్మవారు పోసిందని చెప్పింది. నాకు నిన్ననే సందేహం వచ్చిందనుకో, అది ఈ రోజు నిర్ధారణ అయ్యింది. అందుకని అమ్మవారున్న యింట్లో దంపతులు కలిసిపడుకోవడం మంచిది కాదమ్మా! అందుకే వారిని వాడి గదిలోకి పంపాను, నువ్వూ నేనూ యిక్కడ మాగదిలో పడుకొందాం..." అంటూ యింకా ఏదో చెప్పసాగింది పెద్దక్క.

అంతే! ఒక్కసారిగా 'ధభీ' మని మంచం మీద నుంచి క్రింద పడ్డాను.

కళ్ళు బైర్లు కమ్మాయి. అసలు శనిదేవత అన్నది చిన్నక్క గారింట్లో వుందో. పెద్దక్క గారింట్లోవుందో లేక అసలు నానెత్తిమీదనే వుందో నాకర్థంకాలేదు.

వెంటనే వెళ్ళి, పనిచేసే ఆ అప్పలమ్మపీక పట్టుకొని కొరికి పారేయాలనిపించింది.

ప్రక్కగదిలో శ్రీమతి గాజుల చప్పుడు, వినబడుతుంటుంటే, దానికి లయబద్ధంగా నాలో నేనే ఏడుస్తూ నిద్రకి ఉపక్రమించాను.

§ § §

తెల్లవారింది, పెద్దక్క నవ్వుతూ నన్ను సమీపించి "వాడికి స్నానం చేయించే వరకూ దంపతులు దూరం, దూరంగానే వుండాలిరా" అంది నిట్టూరుస్తూ.

"ఈ సంవత్సరంలోనే వాడికి స్నానం చేయిస్తారా? గొణుక్కుంటూ ప్రశ్నించాను."

"ఛా! అవేం మాటలురా? మహాపడితే ఓ వారం రోజులంతే!"

"వాట్? వారంరోజులా?"

"కాకపోతే పదిరోజులంటే!"

తిరిగి నా నోరు పైకి లేవలేదు. మౌనంగా లేచి, ఆఫీస్ పనిమీద బయటకు బయలుదేరాను.

ఆ సాయంత్రానికి ఆఫీస్ పని పూర్తి అయింది. ఆరోజు ఉదయమే మా ఆఫీసర్ కూడా హైద్రాబాద్ వచ్చి చేరడం వల్ల, అంతకు ముందు రెండురోజులూ నేను పూర్తి చేసి రెడీగా వుంచిన ఫైల్స్‌పై యిక్కడి జనరల్ మేనేజర్ సంతకంతో బాటు, ఆయన సంతకం కూడా పెట్టబడి, కంపెనీ వ్యవహారం ముగింపుకు వచ్చింది.

ఆ రాత్రే మా ఆఫీసర్‌తో తిరుగుప్రయాణం. ఈ సంగతి నెమ్మదిగా శ్రీమతి చెవిని చేరవేశాను.

ఆ మాటతో శ్రీమతి ముఖం ముడుచుకుని పోయి ఒక్కసారి జల, జలా కన్నీళ్ళు కార్చేసింది.

ఏడవలేక నవ్వుతూ, శ్రీమతిని ఓదార్చి వాళ్ళవూరు వెళ్ళాక వుత్తరం వ్రాయమని గట్టిగా చెబుతు పెద్దక్క దగ్గర శెలవు తీసుకొని విచారంగా స్టేషన్ కొచ్చి పడ్డాను.

ఏదో పోగొట్టుకొన్న వాడిలా ఆఫీస్‌కి వెడుతూ, తిరిగి యింటికి వస్తూవున్నాను

ఆషాడమాసం చివరి పాదంలో పడింది. రోజులు భారంగా గడుస్తున్నాయి.

ఎలాగైతేనే, ఆషాడం దాటింది. వెంటనే మూడురోజులు శెలవు గ్రాంట్ చేయించుకొని శ్రీమతికి ఎడ్వాన్సుగానే, నా రాక గురించి తెలిపి ఓ మంచిరోజున బస్ ఎక్కాను.

వెళ్ళేముందు దేవుడికి ఓ మూడుకొబ్బరి కాయలు కొట్టి మరీ బయలుదేరాను.

యిన్నాళ్ళకు నా కోరిక నెరవేరబోతోందని మనసు ఎగిరెగిరిపడుతోంటే, గాలిలో తేలిపోతున్నాను.

మార్గ మధ్యంలో గజ, గజా, ఓ నాలుగు రకాల పూలు, ఓ ఆరు రకాల స్వీట్సూ ప్యాక్ చేయించాను.

* * *

బస్ మా అత్తగారి వూళ్ళో ఆగింది. హుషారుగా ఈలవేసుకుంటూ, దిగి ఒక రిక్షాను పిలిచి "వూళ్ళోకి పోనివ్వమని" ఎక్కి కూర్చున్నాను.

కొంత సేపటికి రిక్షా మా అత్తగారింటి ముందు నిలిచింది. రిక్షావాడికి డబ్బులిచ్చి, యింట్లోకి నడిచాను.

హాలులో అడుగుపెట్టానో లేదో, అక్కడి దృశ్యం నాకంటబడి, నోట తడి ఆరిపోయింది. ఒక్కసారిగా కళ్ళుబైర్లు కమ్మాయి.

హాలులో ఓ ప్రక్క చాపా, చెంబుతో ప్రత్యక్షమైంది నా శ్రీమతి గీతాడార్లింగ్.

అంతే! పూర్తిగా స్పృహతప్పి అక్కడే కూలబడి పోయాను.

(సంపూర్ణం)

TRADE MARK
PANJU TEX
మన్నికకు, ఆహ్లాదానికి...
పంజు టెక్స్ వారి
♦ మాస్టర్ ♦ ఫాంటెక్స్
ఫైన్ బనియన్లనే వాడండి.
ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు:—
దుర్గా ఏజెన్సీస్ పి. బి. నెం 84, విశాఖపట్నం-4.